# మనసును మలిచే శిల్పి

*"చిరంజీవి ఇంకా రాలేదా శాంతా?" కలం టేబులు మీద పడేసి, కాగితాల మీద పేపరు వెయిటు ఉంచి, ఓసారి ఒళ్లు విరుచుకుని లేచి పచార్లు చేస్తూ అడిగాడు మురళీధర్.*

*రాత్రి ఎనిమిది గంటలవుతోంది. రోజూ ఆరింటికల్లా స్కూలు నుంచి ఇంటికి వచ్చేసే చిరంజీవి ఇంకా రాలేదు.*

"ఏమో! ఇంకా రాలేదేవిటో" మురళీధర్ ప్రశ్నకు భార్య సమాధానమిచ్చింది.

"రాధ?"

"రాధ కాలేజీ నుంచి ఈ రోజు కొంచెం ఆలస్యంగా వస్తానని చెప్పింది. ఈపాటికి వస్తూ ఉండాలి".

"వీడేమైనా చెప్పాడా?"

"లేదు."

"కొంపతీసి వీడినెవరైనా కిడ్నేప్ చెయ్యలేదు కదా?" వేళాకోళంగా అన్నట్లు భార్యతో అన్నాడు మురళీధర్ నవ్వుతూ.

"ఏవిటా మాటలు? డిటెక్టివ్ నవలలు రాసి రాసి మీకు మరో ఆలోచన రాదు. కొత్త నవలకి ప్లాటు ఏదైనా కావలిస్తే బయట వెతకండి గానీ ఇంట్లో అలాంటి మాటలనకండి," కాఫీ అందిస్తూ చిరుకోపంతో మందలించింది శాంత. మురళీధర్ నవ్వుతూ టేబులు దగ్గరకు వెళ్లి కూర్చుని కాఫీ సిప్ చేస్తూ మళ్లీ రాసుకోవడం మొదలు పెట్టాడు.

ఈనాడు కాలేజీ కుర్రాళ్లు ఇంగ్లీషు డిటెక్టివ్ నవలలతోపాటు తెలుగు డిటెక్టివ్ నవలలుకూడా గర్వంగా సిగ్గుపడకుండా పట్టుకు తిరుగుతున్నారంటే దానికి కారణం మురళీధరే. అతనికి ఆంధ్రదేశంలో మరే రచయితకి లేనంత ఫాలోయింగ్ వుంది. రచయితకి సినిమా నటుడికున్న గ్లామరు కల్పించిన ఘనత కూడా మురళీధర్‌దే. అయితే ఈ విజయం అతన్ని తేలిగ్గా వరించలేదు.

అతనికి చిన్నప్పట్నుంచీ ఎలాగైనా తను ఒక గొప్ప రచయిత కావాలని చాలా పట్టుదలగా ఉండేది. కొంత కాలం అతను 'సారా', 'సారో' కథల్ని - ఆ రకం కథల్ని ప్రజలు బాగా ఆదరిస్తున్న కాలంలో - అనుకరిస్తూ కథలు వ్రాశాడు కాని అతను కీర్తి కోసమే కాని ఆర్తితో రచనలు చెయ్యకపోవడంవలన నిజాయితీ లోపించి కృత్రిమంగా, పేలవంగా కనుపించేవి అతని రచనలు. అటువంటి రచనలు సమాజాన్ని నిశితంగా పరిశీలించే వారే చెయ్యగలరు కాని కేవలం గుర్తింపుకోసం తహతహలాడే రచయితలు చెయ్యలేరు.

రచయితగా అలా తప్పటడుగులు వేస్తున్న సమయంలో మురళీధర్ ఒకసారి ఇంగ్లీషులో ఓ నవల చదవటం తటస్థించింది. అది ఆధారంగా అతను సెక్సు, హింస మేళవించి ఓ నవల తెలుగులో రాశాడు. చాలా పత్రికలు అది ప్రచురణకి అర్హం కాదని భావించి తిప్పి పంపేశాక అతను నిరుత్సాహంతో ఇంక ఆఖరు సారి ప్రయత్నిద్దామని పంపగా కొత్తగా వస్తున్న ఓ వారపత్రిక ప్రచురణకు అంగీకరించింది.

ఆ సంపాదకుడికి 'ఇది రాయొచ్చు', 'ఇది రాయకూడదు' అనే 'చాదస్తం' లేదు. మురళీధర్ నవల సీరియల్‌గా వేస్తే తన పత్రిక అమ్మకాలు పెరుగుతాయనే నమ్మకం అతనికి కలిగింది. అతనికి మురళీధర్ శైలి నచ్చింది. అయితే వారంవారం సీరియల్‌గా రావాల్సిన నవల పాఠకుల్ని ఆకట్టుకోవాలంటే ఎలా మెలికలు తిప్పాలో మురళీధర్‌కి అప్పటికి తెలియదు. ఆ సంపాదకుడు ఇచ్చిన సూచనల్ని మనసులో పెట్టుకుని జాగ్రత్తగా తిరిగి రాశాక ఆ నవల సీరియల్‌గా ఆ పత్రిక ప్రచురించడం మొదలుపెట్టింది.

ఆ సీరియల్ తెలుగు పాఠకుల్ని ఓ ఊపు ఊపి వారి అభిరుచుల్ని మార్చివేసింది. పత్రికల చరిత్రలో కొత్త అధ్యాయాల్ని సృష్టించింది. కళ కళకోసమా, కళ ప్రజలకోసమా అని చర్చించే వారి మొహం మీద ఓ గుద్దు గుద్ది కళ కూడా వ్యాపారమే నని చాటిచెప్పింది ఆ పత్రిక. క్రమంగా మిగిలిన వారపత్రికలు కూడా పోటీలో నిలవడం కోసం మురళీధర్ వేసిన మార్గంలో నడవక తప్పింది కాదు.

చిట్టచివరికి మురళీధర్‌కి తను ఎటువంటి రచనల్లో తన ప్రతిభ చూపించగలడో తెలిసింది. ఇంక ఆ తర్వాత అతను వెనక్కు తిరిగి చూడలేదు...

"గుడ్ ఈవినింగ్ డాడీ," మెడిసిన్ చదువుతున్న కూతురు రాధ లోపలికి వస్తూ అంది.

"గుడ్ ఈవినింగ్!" రాయడం ఆపి తలెత్తిచూసి అన్నాడు మురళీధర్.

"మీ కొత్త నవల పూర్తయిందా?"

"దాదాపు అయిపోయింది."

"అమ్మ చదివాక నే చదువుతా," అంటూ లోపలికెళ్లింది రాధ.

"ప్రతీ నవల పూర్తయ్యాక మొదట శాంత చదువుతుంది. రెండో అభిమాని కూతురు రాధ. సుపుత్రుడు చిరంజీవి రాస్తున్నప్పుడు పక్కనే కూర్చుని వారించినా వినకుండా పేజి పేజి చదివేస్తాడు.

పూర్తి అయ్యేదాకా ఆగమన్నా ఆగడు. అంత ఆతృత వాడికి.

"వీడింకా రాలేదా శాంతా?" మళ్లీ చిరంజీవి గుర్తుకొచ్చి అడిగాడు మురళీధర్.

రాత్రి తొమ్మిదవుతోంది.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను," అంది శాంత ఈసారి నిజంగా కంగారుపడుతూ.

"తమ్ముడింకా రాలేదా? స్కూలుకి ఫోను చేస్తే?" అంది రాధ.

"స్కూల్లో ఉంటాడా? అయిదింటికే వదిలిపెట్టేస్తారే?" అంది శాంత.

"సినిమాకి వెళ్లాడంటావా?"

"చెప్పకుండా వెళ్లడే!?"

"ఎందుకా కంగారు? వాడికి పదిహేను నిండాయి. చిన్న పిల్లాడు కాడు. ఏదో స్నేహితులందరూ అనుకోకుండా సినిమాకి వెళ్లుంటారు. ఇంకో అరగంటలో వచ్చేస్తాడు కాని మీరేం బెంగపెట్టుకోకండి," అని శాంతని, రాధని మెల్లిగా మందలించి, చిరంజీవిని గురించిన ఆలోచన పక్కకి నెట్టి మళ్లీ రాతలో మునిగిపోయాడు మురళీధర్.

..... మురళీధర్ విజయం అతనికి సమస్యలు సృష్టించకపోలేదు. స్వయంగా ఆలోచనా శక్తి తక్కువైనా అనుకరణలో అద్భుతమైన ప్రజ్ఞ చూపించగల రచయితల పోటీ ఎక్కువైంది అతనికి. ఆ పోటీ తట్టుకోడానికి

సెక్సూ, హింసా నవల నవలకి పెంచుకుంటూ పోవాల్సివచ్చింది. ఇదివరకు ఓ హత్యతో, ఓ రేప్‌తో ఊరుకునే పాఠకులు ఇప్పుడు పది హత్యలు, ఇరవై రేప్‌లున్నా సంతృప్తి పడడం లేదు.

అనుకరించే వారికంటే అతను ఓ అడుగు ముందుండడానికి మరొక కారణం కూడా ఉంది. అతను 'సారా' కథల రోజుల్లో రాసిన కథలు పేరు తెచ్చిపెట్టకపోయినా జనాల్లో ఉండే ఆవేశాన్ని అర్థం చేసుకోడానికి కొంతవరకూ ఉపకరించాయి. దానికి అతను సూడోఫిలాసఫీ ఒకటి తగిలించి ఓ కొత్తరకం హీరోని తయారుచేశాడు. ఆ హీరో పచ్చినెత్తురు తాగేవాడే కావొచ్చు. కాని అతన్ని తయారు చేసింది ఈ సమాజం. కనుక ఆ సమాజం మీద అతను కసి తీర్చుకుంటాడు. తమ ఉనికి పట్ల అసహ్యంతో, ఆవేశంతో మండిపోతున్న పాఠకులు మురళీధర్ సృష్టించిన నాయకుడు నిజజీవితంలో తాము చెయ్యలేనివన్నీ నిస్సిగ్గుగా, నిర్భయంగా చేసేస్తుంటే ఆరాధించడం మొదలు పెట్టారు.

అతని పాత్రలకున్న ఈ మాత్రం డెప్త్ కూడా అతన్ని అనుకరించే వారి రచనల్లో లేకపోవడంతో అతని స్థానం అతనికి ఇంతవరకూ నిల్చిపోయింది.

అతన్ని అనుకరించేవారు ఒక ప్రక్క బయలుదేరితే, అతన్ని విమర్శించే వారు మరో ప్రక్క తయారయ్యారు.

మురళీధర్ చాలామంది రచయితల్లా కాకుండా మంచి వక్త. తను చెప్పదలచుకున్నది సూటిగా, నేర్పుగా, హృదయాలకి హత్తుకునేలా చెప్పగల శక్తి అతనికి వుంది.

"నేను నా నవలల్లో నీతి ప్రబోధాలు చెయ్యడం లేదని విమర్శిస్తున్నారు నా మిత్రులు కొందరు," విమర్శకులను హేళన చేస్తూ అనేవాడు మురళీధర్. "నా నవలలు పది కొన్నవారికి ఇక ముందు మహాత్మాగాంధీ, బుద్ధుల బోధనల పుస్తకం ఒకటి బోనస్ బుక్‌గా ఉచితంగా ఇద్దామను కుంటున్నాను (నవ్వులు). సూక్తిముక్తావళి కావాల్సినవారు నవలలు మూసేసి - మధ్యలో మూయగలిగితేనే (నవ్వులు) - వారు అవి చదువుకోవచ్చు. లేకపోతే ఇవి గుర్తుపెట్టుకు చదువుకోండి."

"రాముడు మంచి బాలుడు."

"ఉదయమే లేచి సిబాకా టూత్‌పేస్టుతో దంతధావనం చేయును."

"సినిమా తారలకు సౌందర్యాన్నిచ్చే లక్స్ టాయిలెట్ సోపుతో చన్నీటి స్నానము చేయును." శ్రోతలు విరగబడి నవ్వేవారు.

నిజం చెప్పాలంటే అతను విమర్శకుల్ని ఎన్నడూ సీరియస్‌గా తీసుకోలేదు. తనంటే అసూయతో వాళ్లు తన్ను విమర్శిస్తున్నారనే అభిప్రాయం అతని మనసులో ఉండేది. హోరెత్తే సముద్రంలాంటి అభిమానుల ప్రశంసల మధ్య ఓ నాలుగైదు గొంతుకలు పలకడానికి ప్రయత్నించినా పట్టించుకునే వారెవ్వరూ సహజంగానే లేకపోయారు.

విజయం అతన్ని కొరడా పుచ్చుకు తరుముతుంటే, ఏ రోజు ప్రింటులో కనుపించకపోతే ఆ రోజు ప్రజలు తన్ను మర్చిపోతారేమోనన్న భయంతో ఉన్నట్లు నవల మీద నవల రాస్తూ ఇప్పటికి నలభై రెండు నవలలు రాశాడు మురళీధర్. ఇది నలభై మూడవ నవల .....

"ఏమండీ !" శాంత టేబులు దగ్గరకు వచ్చి అతన్ని ఆపుచేసి అంది కంగారుగా, "చిరంజీవి ఇంకా రాలేదు, పదవుతోంది. ఏ సినిమాకైనా చెప్పకుండా వెళ్లినా ఈపాటికి వచ్చెయ్యాలి. మీరొకసారి వాడి స్నేహితుల ఇళ్లకి వెళ్లి వాళ్లనడిగి చూడకూడదూ."

మురళీధర్‌కి ఇప్పుడు నిజంగా ఆతృత అనిపించింది. ఏ ఏక్సిడెంటైనా జరగలేదు కదా అని గుండె ఝల్లుమంది. అతను లేచి బట్టలు మార్చుకుని స్కూటరు స్టార్టు చెయ్యబోతుండగా చిరంజీవి వచ్చాడు. చిరంజీవిని చూడగానే మురళీధర్ ఆతృత ఆవేశంగా మారింది.

"ఎక్కడి కెళ్లావ్?" మురళీధర్ కన్నెర్ర జేసి అరిచాడు.

"క్రికెట్ ఆడుతున్నాను." తండ్రి కోపం గుర్తించి తల వంచుకుని మెల్లిగా సమాధానం చెప్పాడు చేతిలో బాట్ చూపిస్తూ.

"ఇంత రాత్రిదాకా క్రికెట్ ఆడుతున్నావా?"

"... ..."

"సమాధానం చెప్పు," మురళీధర్ గద్దించాడు. చిరంజీవి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"పోన్లెండి, ఇంకెప్పుడూ చెప్పకుండా ఆలస్యంగా రాడు," అంటూ చిరంజీవి తరఫున శాంత చెప్పింది. కొడుకు కేసి తిరిగి, 'నువ్వు లోపలకు పద' అంది.

"పరీక్షలు దగ్గర పడ్డాయనే ఆలోచనే లేకుండా రాత్రి పదింటి దాకా ఊరంతా తిరిగివచ్చిన కొడుకుని చూస్తే మురళీధర్‌కి ఆగ్రహం కలిగింది. గేటు దగ్గరనుంచి చిరంజీవి హాలులోకి రాగానే ట్యూబ్‌లైట్ వెలుగులో చిరంజీవి వాలకం చూసి అతని కోపం తారస్థాయికి చేరు కుంది.

"బట్టలన్నీ అలా మాపేసుకు వచ్చావే, ఆ మరక లేమిటి?"

చిరంజీవి ఉలిక్కిపడి, వణుకుతూ సమాధానం చెప్పాడు. "బాలు బురదలో పడిపోయింది. తీద్దామని దిగితే అంటుకుంది."

"వెళ్లు! కాళ్లూ చేతులూ కడుక్కో! భోంచేద్దువుగాని." కొంచెం గొంతు తగ్గించి అన్నాడు మురళీధర్.

చిరంజీవి స్నానాల గదిలోకి నడిచాడు. మురళీధర్ అసహనంగా పచార్లు చెయ్యడం మొదలు పెట్టాడు.

చిరంజీవి నిజం చెప్పలేదన్న విషయం అతనికి స్పష్టమయింది. రాత్రి పదింటిదాకా వాడు క్రికెట్ ఆడడమనేది అర్థంలేని మాట, తననుంచి వాడు ఏదో దాస్తున్నాడు. ఆలోచిస్తూ మురళీధర్ పచార్లు చేస్తున్నాడు. పది నిమిషాలైనా చిరంజీవి బాత్రూంలోంచి బయటపడకపోతే విసురుగా తలుపు నెట్టాడు మురళీధర్. బకెట్లో సర్ఫ్ వేసి నురగవచ్చేలా కలుపుతున్నాడు చిరంజీవి.

"ఏమిటది?"

"బట్టలు మాసిపోయాయి, ఉతుకుదామని."

ఎన్నడూ కోప్పడని తను కోప్పడేసరికి కుర్రాడు బెదిరిపోయాడు అనుకున్నాడు మురళీధర్. అతనికి జాలి వేసింది.

"అవి అమ్మ ఉతుకుతుంది. లేకపోతే రేపు చాకలికి వేద్దాం! నువ్వు నడు."

చిరంజీవి మౌనంగా డైనింగ్ టేబుల్ దగ్గరకు నడిచాడు. భోజనాల దగ్గర ఇంక ఎవరూ ఏమీ మాట్లాడలేదు. ఏదో అన్నం తిన్నాననిపించి లేచిపోయాడు చిరంజీవి.

"ఎందుకు చిన్న విషయానికి అంత కోప్పడ్డారు పిల్లాడిని? రేపు మెల్లిగా అడిగి తెల్సుకోవచ్చుకదా! వాడు అన్నంకూడా సరిగ్గా తినలేదు."

అంది శాంత బాధపడుతూ.

తల్లి పక్కలు వేస్తుంటే చిరంజీవి తల్లి చెయ్యి పట్టుకుని, "అమ్మా! నేను ఇవాళ నీ దగ్గరే పడుకుంటా," అన్నాడు సణుగుతున్నట్టు.

అందరూ గొల్లున నవ్వారు.

"చంటిబాబై పోయాడే అమ్మా, నీ ముద్దుల కొడుకు!" - అంది రాధ.

"పదిహేనేళ్లొచ్చి ఇంకా అమ్మదగ్గర పడుకోవడమేవిట్రా! మీ ఫ్రెండ్స్‌కి తెలిస్తే నవ్వుతారు," అన్నాడు మురళీధర్ నవ్వుతూనే.

ఉన్నట్టుండి చిరంజీవి వెక్కి వెక్కి ఏడుస్తుంటే అందరూ ఆశ్చర్యపోయి ఒకరి మొహాలు ఒకళ్లు చూసుకుంటూ నిలబడిపోయారు. పదినిమిషాలకు కాని వాడ్ని ఊరుకోబెట్టడం సాధ్యంకాలేదు.

"ఏమైంది వీడికివాళ? బహుశా క్లాసులో టీచరు నలుగురిలోనూ మందలించి ఉండవచ్చు. వీడికి మనసు బాగాలేదు. రేపు వివరంగా అడగొచ్చు," అనుకున్నాడు మురళీధర్ మనస్సులో.

రాత్రంతా తల్లి దగ్గరే, తల్లిమీదే చెయ్యివేసి పడుకున్నాడు చిరంజీవి. కలతనిద్రలో కలవరిస్తూ రెండుమూడుసార్లు ఉలిక్కిపడి లేచాడు కూడా.

మర్నాడు ఉదయం భోజనాలైనతర్వాత చిరంజీవి స్నేహితుల్ని కలుసుకోవడానికి వెడుతున్నానని, మళ్లీ సాయంత్రం వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. ఉదయం మామూలుగా తిరుగుతున్న వాణ్ణి ఏవీ అడగలేదు. అసలు రాత్రి ఏమీ జరగనట్టే ప్రవర్తించారు.

"ఎందుకు ఇప్పుడు వెళ్లడం," అని అందామనుకున్నాడు కాని కొంచెం సేపు బయట తిరిగివస్తే వాడే కోలుకుంటాడని ఊరుకున్నాడు మురళీధర్.

మధ్యాహ్నం ఒంటిగంట అవుతుండగా నవల పూర్తిచేసి భార్యకిచ్చాడు మురళీధర్. ఆవిడ చదివి చాలా బావుందని చెప్పి రాధ కిచ్చింది. రాధ సగం చదివి ఎవరో స్నేహితులు వస్తే మాట్లాడుతూ కూర్చుంది. టీ ఇచ్చి స్నేహితులను పంపించి మళ్లీ నవల మొదలు పెట్టిన పదిహేను నిమిషాలకు కాలింగ్ బెల్లు మ్రోగుతుంటే తలుపు తీసింది.

ఎదురుగా కనిపించిన పోలీస్ ఆఫీసర్‌ని, "రండి, నాన్నగారు నిద్రపోతున్నారు. లేపుతాను," అంటూ లోపలికి ఆహ్వానించింది రాధ.

మురళీధర్‌కి పోలీసు డిపార్టుమెంటులో చాలామంది ఆఫీసర్లతో స్నేహం ఉంది. నవలలకు మెటీరియల్ సేకరించడంలో వాళ్లు తోడ్పడి తమకు తోచిన సలహాలిస్తుంటారు. ఎదురుగా నిలబడ్డ పోలీసు ఆఫీసర్ హాలులోకి రావడానికి రెండడుగులు ముందుకు వెయ్యగానే, వెనక్కి తిరగబోతున్న రాధ గేటుకేసి చూసి అలాగే ప్రతిమలా నిలబడిపోయింది.

పోలీసు వ్యానులోంచి చిరంజీవి దిగుతున్నాడు.

రాధ తేరుకుని "ఏమైందండి?", అని అడగబోతుంటే అతను క్లుప్తంగా "నాన్నగార్ని పిలవండి," అని అన్నాడు.

అలా అంటుండగానే అతని దృష్టి టేబుల్‌మీద ఉన్న నవల వ్రాత ప్రతిమీద పడింది. అది చేతుల్లోకి తీసుకుంటూ, "ఇదేనా నాన్నగారు వ్రాస్తున్న కొత్త నవల," అన్నాడు పరిశీలనగా పేజీలు తిరగేస్తూ. రాధ లేపగా వచ్చిన మురళీధర్ పోలీస్ ఆఫీసర్ని చూసి విష్ చేశాడు. మురళీధర్‌కి అతనితో పెద్ద స్నేహం లేకపోయినా పరిచయం మాత్రం వుంది. పోలీసు వ్యానులోంచి దిగి లోపలికి వచ్చిన చిరంజీవి తల్లిదండ్రుల్ని చూసి బావురుమన్నాడు.

అయోమయంగా తనకేసి తిరిగిన మురళీధర్‌తో మరే ఉపోద్ఘాతం లేకుండా అన్నాడు పోలీస్ ఆఫీసర్:

"మీవాడు హత్య చేశాడు."

పిడుగు పడ్డట్టయి అందరూ క్షణకాలం బొమ్మల్లా నిలబడిపోయారు. మురళీధర్‌కి నమ్మశక్యంగా అనిపించలేదు, నిండా పదిహేనేళ్లు లేనివాడు హత్య చేయడమా? ఏదో...ఎక్కడో బహుశా పొరపడ్డారేమో!

"పొరపాటు లేదు. హత్య చేసినట్లు చిరంజీవే ఒప్పుకున్నాడు. శవాన్ని పోస్టుమార్టంకి పంపించాం."

ఇంకా పసితనం పోని చిరంజీవి హంతకుడా? వాడు ఒప్పుకున్నాడా? పోలీసులు ఎలా ఒప్పిస్తారో మురళీధర్‌కి బాగా తెలుసు. అతనికి ఆపుకోలేని ఆవేశం వచ్చింది.

"మీరు ఆవేశపడకండి! అనుమానముంటే ఈ రక్తపుమరకలు చూడండి!" స్నానాల గదిలోంచి కానిస్టేబుల్ తీసుకువచ్చిన చిరంజీవి బట్టలమీద రక్తపు మరకలు చూపిస్తూ మురళీధర్‌తో అన్నాడు పోలీస్ ఆఫీసర్.

రాత్రి చిరంజీవి చెప్పినట్లు అవి బురద మరకలు కావన్నమాట.

హఠాత్తుగా మురళీధర్‌కి అంతా స్పష్టమైంది. చిరంజీవి ఆలస్యంగా రావడం, రాత్రికి రాత్రే బట్టలు ఉతకాలనుకోవడం, ఒంటరిగా పడుకోడానికి భయపడ్డం, అకారణంగానే వెక్కి వెక్కి ఏడ్వడం - అన్నింటికి కారణం అతనికి ఇప్పుడు అర్థమైంది. రెండు చేతులతోనూ తలపట్టుకుని కుర్చీలో కూలిపోయాడు మురళీధర్ నిస్సత్తువగా.

చిరంజీవి గొల్లున ఏడవసాగాడు. శాంత, రాధ వాణ్ణి కౌగిలించుకుని ఏడుస్తున్నారు. రాధ శాంతతో ఏదో అంటోంది. శాంత పోలీసు ఆఫీసర్ కేసి తిరిగి ఏడుస్తూనే ఏదో అడుగుతోంది. మురళీధర్ కళ్లు ఎదురుగా జరిగేదంతా చూస్తున్నా అతని మెదడు మాత్రం జరిగేది గ్రహించే శక్తి కోల్పోయింది.

"నిన్న సాయంకాలం స్కూలు వదిలిపెట్టిన తర్వాత లోయర్ కేజీలో చదువుతున్న రమేష్ అనే నాలుగేళ్ల కుర్రాణ్ణి మీవాడు సినిమాకు తీసుకెడతానని చెప్పి తీసుకువెళ్లాడు ..." పోలీసు ఆఫీసర్ చెబుతున్నాడు. మురళీధర్ మతిలేని వాడిలా వింటున్నాడు.

"...చీకటి పడేవరకు నెహ్రూ పార్కులో తిప్పాడు. పార్కు వెనకాల మెయిన్ స్క్వేయర్ లైన్స్ వెయ్యడానికి రోడ్డు పదడుగుల లోతు తవ్వారు. మీరు చూసే వుంటారు. పొరపాటున ఎవరూ జారిపడకుండా కర్రలతో ఫెన్సింగ్ కట్టారు. పనివాళ్లు వెళ్లిపోయాక అక్కడ చౌకీదారు తప్ప ఎవ్వరూ ఉండరు."

"సినిమాకి ఎప్పుడు వెడదాం అని రమేష్ పేచీ మొదలుపెట్టాడు చీకటి పడగానే. వాడిని మూసేసిన రోడ్డు వేపు తీసికెళ్లి బండరాయితో వాడి తలమీద బలంగా ఒకటి వేశాడు చిరంజీవి. మొదటి దెబ్బకే పసివాడి ప్రాణం పోయివుంటుంది. అనుమానం లేకుండా క్రింద పడ్డవాణ్ని మరో దెబ్బ వేశాడు."

"పైకి క్రిందికి వెడుతూ పనిచెయ్యడానికి పనివాళ్లు గొయ్యి అంచున మెట్లు కట్టారు. ఆ మెట్ల మీదుగా శవాన్ని క్రిందకు తీసుకుపోయి గొట్టాలు వేస్తున్న చోటుకి తీసుకువెళ్లాడు. గొట్టాలు దింపే చోట తను తెచ్చిన ఊచతో గొయ్యి తవ్వాడు. ఆ ఊచకూడా దొరికింది. అక్కడ కాపలా ఉన్న చౌకీదారు అలికిడై ఈల వెయ్యగానే బాగా లోతు తవ్వకుండానే శవాన్ని దింపి పైన చేతులతో మట్టి సర్దేశాడు. చౌకీదారు విజిలేశాడు కాని లేచి చూడలేదు."

"ఈ రోజు ఉదయం చిరంజీవి రమేష్ తల్లిదండ్రులకి ఫోన్ చేశాడు - కుర్రాడు క్షేమంగా తిరిగి రావాలంటే ఏభైవేలు ఇవ్వాలని చెప్పాడు ..."

పోలీసు ఆఫీసరు అంతా వివరంగా చెబుతున్నాడు కానీ మురళీధర్‌కి ఏమీ అర్థం కావడం లేదు.

"...ట్రాప్ చేశాం - నిజం చెప్పాలంటే చిరంజీవిని చూసేటప్పటికి మాకూ షాక్ తగిలింది. నేరస్తుడు ఆరితేరినవాడనుకున్నాంగాని ఇంత చిన్న వయసువాడని మేం ఊహించలేదు ..."

"అంతకు ఓ గంట ముందు పనివాళ్లు ఈ రోజు పని మొదలు పెట్టబోతుండగా కుక్క ఒకటి కాళ్లతో మట్టి కెలుకుతూ అరవడం చూశారు. ఏవిటా అని దగ్గరకెళ్లి చూస్తే చెయ్యి కనిపించింది. వాళ్లు భయపడి వెంటనే పోలీసులకు రిపోర్టు చేశారు."

మురళీధర్‌కి కాని, శాంతకిగాని, రాధకిగాని పోలీసు ఆఫీసరు చెబుతున్నది సస్పెన్సు థ్రిల్లర్‌లా ఎక్సైటింగ్‌గా లేదు. పసివాడి శవాన్ని కుక్క పీకుతున్న దృశ్యం వాళ్ల కళ్లముందు మెదిలి కడుపులో దేవినట్లయింది. ఇంత ఘోరం - తమ కళ్ల ముందు పుట్టి పెరిగి, ఇంకా కళ్లు సరిగా విప్పని చిరంజీవి చెయ్యగలిగాడంటే ...

మురళీధర్ కొడుకు వైపు చూశాడు - ఎన్నడూ చూడనట్లు పరిశీలనగా.

చిరంజీవి ఈ మధ్య కొంచెం పొడుగు ఎదిగినా ఇంకా మొహంలో పసితనం, కళ్లల్లో అమాయకత్వం పోలేదు. ఆ కళ్లు చూస్తే చిరంజీవి పసితనం గుర్తుకు వచ్చింది మురళీధర్‌కి.

లోకం అంతా అమాయకంగా చిన్న చిన్న కళ్లతో చూసిన చిన్నబాబు ఈ రోజు హంతకుడిగా ఎలా మారాడు? వీడు పుట్టుకతోనే హంతకుడా? కాకపోతే వీడిలో ఈ మార్పు ఎప్పుడు ఎలా వచ్చింది? టి.వి. తెరమీద, సినిమాల్లోనూ జరిగే దోపిడీలు, హత్యలూ మిలమిల మెరిసే కళ్లతో మైమరచిపోయి చూస్తున్న వాడి బుర్రలో ఏ ఆలోచనలు మెదిలాయి? ఎదిగే ఆడపిల్లలు బొమ్మల పెళ్లిళ్లు ఆడుతూ సంసార బాధ్యతలకు మానసికంగా అలవాటు పడటం నేర్చుకున్నట్లు చిన్నప్పట్నుంచీ బొమ్మతుపాకులతో ఆడుతూ వాడికి హంతకుడి మనస్తత్వం వచ్చిందా?

ఇదంతా ఆలోచించలేదు మురళీధర్. అతని మనస్సులో ఒకటే

ప్రశ్న కలవరపెడుతోంది - వీడికి ఏభైవేలు ఎందుకు?

అతను సుడిగాలిలా లేచి కొడుకు దగ్గరకు పరిగెట్టాడు. "నీకు డబ్బు అవసరమైతే నన్ను ఎందుకు అడగలేదు? అసలు నీకు ఏభైవేలు ఎందుకు? ఏం చేద్దామని? ఎందుకు చేశావు?" ...

ఆ ప్రశ్నలకి సమాధానం చిరంజీవి దగ్గరలేదు. వాడు చూస్తున్న సినిమాలు, చదువుతున్న పుస్తకాలూ ఆవేశాన్నిస్తున్నాయే కానీ ఆలోచన నివ్వడం లేదు.

".... మీ వాడు చాలా తెలివితేటలుగా హత్య చేశాడు." పోలీసు ఆఫీసరు చెబుతున్నాడు. "శవం యాదృచ్ఛికంగా బయటపడకపోతే ఈ రోజున గొట్టాలు దింపేసేవారు. గొట్టాలపైన రెండు రోజుల్లో రోడ్డు వేసేసేవారు. పది అడుగుల లోతున స్క్వేయర్ లైన్ల క్రింద శవం ఉండిపోయేది..."

చిరంజీవిని తీసుకుని పోలీసులు మళ్లీ జీపెక్కుతుంటే పోలీసు ఆఫీసరు చెప్పింది మెల్లిగా అతని మెదడు అర్థం చేసుకోగలిగింది.

చిరంజీవి ఏడుస్తున్నాడు.

రాధ ఏడుస్తోంది.

మురళీధర్ ఏడుస్తున్నాడు.

"సారీ మురళీధర్ గారూ - నా డ్యూటీ నేను చెయ్యాలి కదా," పోలీసాఫీసరు ఓదారుస్తున్నట్లు భుజం మీద చెయ్యివేశాడు. ఓ పసివాడి దారుణమైన చావు, వాడి తల్లిదండ్రుల వేదన చూసి వచ్చి, ఇక్కడ ఈ తల్లిదండ్రుల బాధ చూసిన అతని మనసు కరిగింది. - "మీరేమనుకోకపోతే ఓ మాట చెప్పనా?"

"చెప్పండి" - మురళీధర్ పూడుకుపోతున్న గొంతుకతో అన్నాడు.

"నాకు సాహిత్యంతో అట్టే పరిచయం లేదు కాని రచయిత మనసుని మలిచే శిల్పి అంటారు పెద్దలు. వేశ్య ముందు సంసారస్త్రీలా చెడు ముందు మంచి ఎప్పుడూ వెలవెలబోతూ వుంటుంది. చెడుకి ఉన్న ఆకర్షణ మంచికి వుండదు. రచయిత పాఠకుడి మనసుని మంచివైపుకి తిప్పడానికి ప్రయత్నించాలి తప్ప చెడుని ఆకర్షణీయంగా చిత్రించకూడదని నా ఉద్దేశం ..."

మురళీధర్ సమాధానం చెప్పలేదు. అంత దుఃఖంలోనూ మురళీధర్‌కి తన రచనల్ని విమర్శిస్తున్న ఆఫీసరు మీద ఆగ్రహం కలిగింది.

"పోలీసువాడు సాహిత్యం గురించి మాట్లాడవేవిటా అనుకుంటున్నారా - పోనీండి, ఇది కూడా తీసుకువెడుతున్నా," అంటూ మురళీధర్ నవల వ్రాతప్రతి చూపిస్తూ అన్నాడు.

అతని చేతిలో నవల వ్రాతప్రతి చూడగానే పోలీసు ఆఫీసరు అన్న మాటల అర్థం మురళీధర్‌కి పూర్తిగా బోధపడి కొరడాతో ఛళ్లున కొట్టినట్లయింది. 'అదెందుకు?' అన్నాడు మురళీధర్ వణుకుతూన్న స్వరంతో బలహీనంగా.

"మీ నవలలో హోటల్ పార్ట్నర్ ఒకడు, మరొక పార్ట్నర్‌ని హత్య చేసి పునాదుల్లో పడేసి దానిమీద బిల్డింగ్ కట్టేస్తాడు కదూ... చిరంజీవి చెప్పాడు - ఈ హత్యకి వాడికి ఇన్‌స్పిరేషన్ అదేనట ..."

*(ఉదయం వీక్లీ, 16-4-1987, సౌజన్యంతో...)*

✤ ✤ ✤